# రాత

వెంకటస్వామి చనిపోయి అప్పటికి వారంరోజులైంది.

రామచిలుక వున్న పెట్టె భుజాన తగిలించుకోబోయాడు పెంచలయ్య.

వాకిలి వూడుస్తున్న రమణమ్మ ఉదయం నుంచి కొడుకు వాలకం గమనిస్తూనే వుంది. కొడుకు రామచిలుక పెట్టె అందుకోగానే చీపురు కింద పడేసి గమ్యానికి అడ్డంగా నిలబడింది.

"పెంచలూ? నా మాట వినరా! ఆ చిలుకపెట్టె మనకి కలిసి రాలేదురా. మీ తాత చిలుక జోస్యం చెప్పేవాడు. ఆయన దగ్గర ఇరవై చిలుకలు వుండేవి. పట్టుమని ఏ చిలుకా రెండు నెలలు ఆయన దగ్గర వుండేది కాదు. తాగుడుకు డబ్బులు అవసరం అయితే అమ్మేసేవాడు. వుంచుకున్న దానికి చీర కొని పెట్టాలంటే దగ్గరున్న రామచిలుకల్ని అమ్మేవాడు. కొత్తవాటిని పట్టుకుని మచ్చిక చేసేవాడు నెలరోజుల్లో. ఆయన చిలుక జోస్యం చెప్పినన్నాళ్ళూ కటిక దరిద్రం అనుభవించేవాడు. చిలుకపెట్టె పట్టుకోవద్దని మీ నాన్నకి చెప్పేడు చనిపోయే ముందు. మీ నాన్న వింటేగా! మీ తాత చనిపోయిన మర్నాడే పెట్టె పట్టుకుని మీ నాన్న బయల్దేరాడు. దరిద్రం మనల్ని వొదలిపెట్టలేదు. మీ తమ్ముడికి ఫోలియో జబ్బు వొచ్చి కాళ్ళు చచ్చుబడిపోయింది ఎందుకనుకున్నావురా! అన్నెం పున్నెం ఎరుగని రామచిలుకల్ని పట్టుకుని రెక్కలు కత్తిరించి పెట్టెలో పెట్టి చిత్రహింసలు చేసినందుకే!...

ఆమె కళ్ళు చెమ్మగిల్లినాయి.

'మనంబతికేదెట్లాగమ్మా?" అన్నాడు పెంచలయ్య తల్లికి నచ్చచెప్పాలనే ప్రయత్నంలో.

"అందరూ చిలుక జోస్యం చెప్పే బతుకుతున్నారా! కూలినాలి చేసుకుని పొట్టనింపు కుందాం. కాని మనకు చిలుకలు సంపాదించిన కూడొద్దురా!"

"నీదంతా చాదస్థ మమ్మా! ఈ పెట్టెలో చిలుక రోజుకి పదిరూపాయలన్నా సంపాదిస్తుంది. మనం రెక్కలు ముక్కలు చేసుకున్నా చిలుక సంపాదించినంత సంపాదించలేం.... వో రోజు పనిదొరికితే మరో రోజు మనకి పని దొరకదు. జ్వరం వొస్తే పస్తు పడుకోవాల్సిందే మనం. చిలుక అలా కాదు గదా రోజు మనకి డబ్బు వొచ్చేటట్లు చేస్తుంది... అసలు నీకేం తెలియదు లేవే... నువ్వు తప్పుకో! ఇప్పటికే బాగా ఎండెక్కింది.

రమణమ్మని నెట్టుకుని రోడ్డు మీదకు పరుగెత్తాడు పెంచలయ్య. పెంచలయ్య వయస్సు పదహారేళ్లుంటాయి. కొత్తగా ఉద్యోగం దొరికిన వాడలా ఉషారుగా నడుస్తున్నాడు.

.... తండ్రి బతికున్నప్పుడు రామచిలుక వున్న పెట్టెను అంటుకొనిచ్చేవాడు కాదు... ఇప్పుడు తనిష్టం... చిలక తన సొంతం.....

పెంచలయ్య తండ్రి వెంకటస్వామికి రామచిలుకల్ని పట్టుకోవడంలో, వాటికి తర్ఫీదు ఇవ్వడంలో మంచి నేర్పు వుండేది.

రామచిలుకని పట్టుకోగానే దాన్ని వారంరోజులు తిండి పెట్టకుండా పస్తు వుంచేవాడు. వరుసగా పేర్చిన అట్టతో చేసిన కవరు ముక్కతో తీసి యిస్తేనే వడ్లగింజో, మొక్కజొన్న గింజో, జామకాయ ముక్కో పెట్టేవాడు. చిలుక చెప్పినట్లు వినకపోతే తలమీద చిన్న కఱ్ఱపుల్లతో కొట్టేవాడు. చేతిలో కఱ్ఱముక్క చూడగానే గడ, గడ వణికిపోయేది రాంచిలుక. అది ఎగిరిపోకుండా రెక్కల్ని కత్తిరించేవాడు.

రాంచిలుకకు శిక్షణ పూర్తవగానే దాంతో ఎంతో సన్నిహితంగా వుండి చెలిమి చేసుకునేవాడు. అతను చెప్పినట్లు వినేది రామచిలుక.

మొదట్లో పదికి పైగా చెక్క పెట్టెలుండేవి యింట్లో. వొక్కక్క పెట్లో రెండేసి చిలుకలు వుంచేవాడు. రోజుకో పెట్టె తీసుకువెళ్ళేవాడు. చివరకు ఒక్క చిలుకే మిగిలిపోయింది వెంకటస్వామి చనిపోయేనాటికి.

వెంకటస్వామి తండ్రికి తాగుడు అలవాటంటే, వెంకటస్వామికి పేకాట పిచ్చి వుండేది. సంపాదించినదంతా పేకాటలో తగలేసేవాడు. ఇంటికి వొక్క పైసా తీసుకువచ్చేవాడు కాదు. డబ్బు అవసరమైనప్పుడల్లా చిలుకల్ని అమ్మేస్తుండేవాడు. రమణమ్మ కూలి నాలి చేసి సంసారం నెట్టుకు వస్తూ వుండేది.

చిలుక జోస్యం చెప్పడంలో వెంకటస్వామి మంచి నేర్పరి. మనిషిని బట్టి జోస్యం చెప్పేవాడు.

జోస్యం చెప్పించుకోవడానికి వొచ్చిన మనిషి ముందు డబ్బులు తీసి పట్టామీద పెట్టకపోతే. కర్రముక్కతో చిలుకకు సంజ్ఞ చేసేవాడు. చిలుక కవర్ల చుట్టూ తిరిగి పెట్టెలోకి వెళ్ళిపోయేది అదృష్టాన్ని తెలిపే కవరు తియ్యకుండా.

కవర్లో చిన్న దేవుడి బొమ్మ. ఐదారు వాక్యాలున్న కార్డుముక్క వుండేవి. అవి చూసి ఎదురుకూర్చున్న వ్యక్తికీ ఉత్సాహం కల్గించేలా మాట్లాడేవాడు వెంకటస్వామి.

"నీకు ఆంజనేయస్వామి బొమ్మ వొచ్చింది. నువ్వు చాలా ధైర్యశాలివి. ఏ కష్టాన్నయినా ఎదుర్కొంటావ్! ఈ సంవత్సరంలో నీ నుంచి శని పక్కకు తప్పుకుంటాడు. నీ కష్టాల నుంచి గట్టెక్కుతావు. హనుమంతుడు సీతమ్మవారి జాడ కనుక్కున్నట్లు, నువ్వు లక్ష్మీదేవి జాడ కనుక్కుంటావు. నీ యిల్లు బంగారమయమైపోతుంది. ఈ సంవత్సరం పంటలు బాగా పండుతాయి"- అనేవాడు జోస్యం చెప్పించుకునే వ్యక్తితో.

"నాకు పొలమే లేదుగా- ఎవరన్నా ఎదురుమాట మాట్లాడితే.

"ఈ సంవత్సరం నువ్వు తప్పకుండా పొలం కొంటావ్. చిలుక పలుకులకు తిరుగులేదు!" అనేవాడు.

ఈ ధోరణిలో సాగేది చిలుక జోస్యం.

కాలేజి కుర్రాడిని చూసి 'నువ్వు పరీక్షల్లో పాసవుతావ్' అనేవాడు. గడ్డం పెంచుకుని తిరిగే కుర్రాడని 'నీకు ఉద్యోగం దొరుకుతుంది' అని ధైర్యం చెప్పేవాడు. హైస్కూలు కుర్రాడికి 'నీకు ఇద్దరు పెళ్ళాలు' అని చెప్పి నవ్వించేవాడు.

వెంకటస్వామిని చూడగానే జనం చుట్టూ మూగేవారు. అంతకుముందు చెప్పించుకొన్న వాళ్ళే మళ్ళీ చెప్పించుకొనేవాళ్ళు. చిన్నపిల్లలు పెట్టె పక్కనే కూర్చుని చువ్వల తలుపు తియ్యగానే బయటకు వొచ్చి అట్టతో చేసిన కవర్లపై దర్జాగా నడుస్తూ అటు ఇటూ తేరిపార చూసి కవరు తీసి వెంకటస్వామి చేతిలో పెట్టే అందాల రాంచిలుకను చూస్తూ ఆనందించేవాళ్ళు.

డబ్బులు ఇవ్వడానికి పినాసితనం చూసినవాళ్ళకు 'చావుగండం' వుందని బెదిరించేవాడు. వాళ్ళు భయపడి అతను అడిగినంత డబ్బులు ఇవ్వగానే 'నవగ్రహపూజ చేస్తే చావు గండం నుంచి బయటపడవొచ్చని చిట్కా చెప్పేవాడు.

కొంతమందికి చిలుక జోస్యం మీద నమ్మకంలేకపోయినా చిలుక చేసే పనులు చూడ్డానికి ఆసక్తిగా అతని దగ్గర చేరేవాళ్ళు.

అప్పుడప్పుడు పెంచలయ్య తండ్రితో పాటే టౌనుకు వెళ్ళేవాడు. తండ్రి చెప్పే చిలుక జోస్యం శ్రద్ధగా వినేవాడు.

పెంచలయ్య గర్వంగా నడుస్తున్నాడు రోడ్డుమీద.

కన్పించిన ప్రతి వ్యక్తీ జాతకం చెప్పేయ్యగలనన్న ధీమా ఏర్పడింది వాడికి.

ఈ రోజు సంపాదనంతా తనది....

ఇంట్లో పస్తులుండే సమస్యే లేదు.

తమ్ముడికి మిఠాయి కొనుక్కువెళ్ళాలి....

అమ్మకి చీర కొనాలి...

తను చెప్పులు కొనుక్కోవాలి....

ఆలోచనలతో సతమతమవుతూ హైస్కూల్కు ముందుకు చేరుకున్నాడు చుట్టూ పిల్లలు మూగారు.

చింతచెట్టు కిందకు చేరి భుజంమీది దుప్పటి కిందపర్చాడు. దుప్పటి మీద రాంచిలుక పెట్టె పెట్టాడు.

చేతి సంచిలోని అట్ట కవర్లని దొంతరగా పేర్చాడు.

చిలుక జోస్యం చెప్పించుకోవడానికి వో కుర్రాడు ముందుకు వచ్చాడు. కవర్ల పైన ఆ కుర్రాడు పావలా బిళ్ళ వుంచగానే చువ్వల తలుపు తెరిచాడు పెంచలయ్య.

రాంచిలుక నెమ్మదిగా బయటకు వొచ్చింది.

కర్రముక్కతో కవర్లకేసి చూపించి సైగ చేశాడు.

పెంచలయ్య కేసి తీక్షణంగా చూసి గబగబా పెట్టెలోకి దూరింది.

చిలుక కవరు తియ్యకుండా లోపలికి వెళ్ళడంతో పెంచలయ్యకు కోపం వొచ్చింది.

కోపం వొచ్చి చేత్తో పెట్టెలో నుంచి చిలుకను బయటకు లాగేడు.

పెంచలయ్య చేతిని ముక్కుతో పొడిచిందేగాని కవర్ల దగ్గరకు వెళ్ళలేదు చిలుక.

పిల్లలంతా పెద్దగా నవ్వారు.

పిల్లలు నవ్వేసరికి బాగా కోపం వొచ్చింది పెంచలయ్యకి.

కర్రముక్కతో చిలుకని కొట్టాడు.

పెంచలయ్య ఎంత ప్రయత్నించినా చిలకచేత జోస్యం చెప్పే కవరు తీయించలేకపోయాడు.

చిలుకమీద పట్టరాని కోపం వచ్చింది.

పైసా సంపాదన లేకుండా యింటి మొహం పట్టాడు.

దార్లో సింహాచలం కన్పించాడు.

వాడు రోడ్డుమీదగారడి విద్యలు చేస్తుంటాడు.

"మీ తమ్ముడ్ని నాతోపాటు పంపరాదట్రా! రోజుకి ఐదు రూపాయలిస్తా! నెలరోజుల్లో తీగమీద చేతులుతో నడిచే విద్య నేర్పిస్తా!"

"మా వాడికి కాళ్లు లేవుగా.... నువ్వే తీగలమీద నడువు! నడిరోడ్లో నాట్యంచేసే ఖర్మ మా వాడికేం పట్టలేదు" సింహాచలంతో అక్కసుగా అన్నాడు.

"అది కాదోయ్! కాళ్ళు చేతులు వున్నవాడు తీగమీద నడిస్తే ఈ రోజుల్లో ఎవ్వరూ చూడటంలేదురా! కుంటోడు చేతులమీద నడిస్తే అందరూ నోళ్ళు తెరుచుకుని చూస్తారు... నా మాట వినరా బాగా డబ్బులొస్తాయి" అన్నాడు సింహాచలం.

"నీ ముష్టి డబ్బులు మాకేం అక్కర్లేదు!" అంటూ విసురుగా యింటికి వచ్చేశాడు.

చిలుకమీద కోపం తగ్గలేదు.

దాని భరతం ఎలా పట్టాలానని చాలాసేపు ఆలోచించేడు. చివరకి వో ఉపాయం తట్టింది.

ఇంట్లో అందరూ పడుకున్నాకా చిలుకను పెట్లే నుంచి తీసి వంటింట్లో వుంచాడు.

కిటికి తలుపులు మూశాడు.

పెంపుడు పిల్లిని తెచ్చి వంటింట్లో వుంచి తలుపులు వేశాడు.

పెంచలయ్య మనస్సు తేలికపడింది.

కొద్దిక్షణాల్లో చిలుక పని గోవిందా!

రెక్కలు లేని చిలుక ఎగర్లేక ఎగురుతూ వుంటుంది. వాటంచూసి పిల్లి దాని మెడ కసుక్కున కొరుకుతుంది.

చిలుక రోగం ఈ దెబ్బతో కుదురుతుంది.

దుప్పటి ముసుగు తన్ని పడుకున్నాడు.

నిద్రపోయాక కలలు రాకుండా వుంటాయా?

..... తమ్ముడు ఎత్తుగా గడలకు కట్టేసి తీగమీద చేతులమీద వో చివర్న నుంచి మరో చివరకు వొస్తున్నాడు... మధ్యలో చేతులు పట్టుతప్పాయి.... బ్యాలెన్సు కుదర్లేదు... గబాలున కిందపడిపోయాడు....

రక్తం మడుగులో తమ్ముడు.... అవిటి తమ్ముడి పక్కనో చిలుక....

....సింహాచలం రక్తంమడుగులో పడ్డ చిల్లర డబ్బులు ఏరుకుంటున్నాడు....

ఉలిక్కిపడిలేచాడు పెంచలయ్య. బాగా తెల్లారిపోయింది.

వంటింట్లోకెల్లి చూసాడు.

పొయ్యి దగ్గర ముడుచుకుపడుకున్న పిల్లి లేచి 'మ్యావ్.... మ్యావ్' అంటూ కాళ్ళచుట్టూ తిరగసాగింది. చిలుక తాలూకు అవశేషాలు ఎక్కడా కన్పించలేదు.

ఇంట్లోనుంచి బయటకు వచ్చాడు.

వేపచెట్టు కింద చిలుకపెట్టె పక్కన పెట్టుకుని తమ్ముడు కన్పించాడు.

"రా బుజ్జి.... రా...బాబుగారి అదృష్టం తెల్చేకవరు తియ్యి" చిలుక తల నిమిరి అంటున్నాడు తమ్ముడు.

చిలుక గర్వంగా కవర్ల దొంతరపైన నాల్గడుగులు వేసింది.

దర్జాగా వో కవరుతీసి చేతిలో పెట్టింది.

దానితో వడ్లగింజ పెట్టి పెట్టెలోకి పంపించాడు చిలుకను.

.... తన తండ్రి అంతే! ఆ చిలుకను వొళ్ళంతా నిమిరి బుజ్జగిస్తూ.... దానికి మాటలు చెప్పేవాడు.... అది చెప్పినట్లు వినేది... దానికి కడుపునిండా తిండిపెట్టేవాడు.

తను కసురుకొంటూ చెబితే తన మాట వింటుందా? "అన్నయ్యా! రాత్రి నువ్వు మర్చిపోయి చిలుకను వంటింట్లో వదిలేశావ్! పిల్లి కూడా ఆ యింట్లో దూరింది. నాలుగైదు ఎలుకల్ని పట్టినట్లుందిగాని మన చిలుక జోలికి పోలేదు."

"దాని రాత బాగుండబట్టే పిల్లి చంపలేదు" అనుకున్నాడు మనస్సులో పెంచలయ్య.

తమ్ముడిని, చిలుకని ముద్దుపెట్టుకొన్నాడు పెంచలయ్య.

క్షమించానన్నట్లుగా తలెత్తి పెంచలయ్య వైపు చూసింది రాంచిలుక.

– 'ఆంధ్రపత్రిక' సచిత్రవారపత్రిక, **7** ఫిబ్రవరి **1986**